క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల రూరల్: మండలంలోని పూడురు సబ్‌స్టేషన్ 33కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, వీరాపురం సబ్‌స్టేషన్ ఎదురుగా కొత్త ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు మండలంలోని వీరాపురం, బీరెల్లి, పూడురు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ప్రాగటూరులో తాగునీటి ఎద్దడి



ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరులో 10 రోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా నాయకులు మద్దిలేటి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మిషన్ భగీరథ నీరు కుళాయిలకు సరఫరా కాకపోవడంతో ప్రజలు బిందెలతో నిరసన తెలిపారు. మిషన్ భగీరథ ఏఈ ఆర్షద్, స్పెషల్ ఆఫీసర్ ఇంతవరకు గ్రామానికి రావట్లేదని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం మాల ధారులు అయ్యప్ప శరణుగోష, అష్టోత్తరణలతో మంగళహారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, అర్చకులు ఆంజనేయశర్మ, గురుస్వాములు సూర్యకాంతారెడ్డి, రాముడు తదితరులు పాల్గొన్నారు.


టోర్నమెంట్‌ను పకడ్బందీగా నిర్వహిద్దాం

అయిజ: మండల స్థాయి సీఎం కప్పు టోర్నమెంట్‌ను పకడ్బందీగా నిర్వహిద్దామని తహసీల్దార్ జ్యోతి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటయ్య, ఎంఈఓ రాములుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ జ్యోతి మాట్లాడుతూ ఈనెల 26, 28 తేదీల్లో నిర్వహించనున్న సీఎం కప్పు మండల స్థాయి టోర్నమెంట్‌కు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థులతో పాటు ఇతరులు కూడా క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. అండర్ 14, అండర్ 18 విభాగాలతో పాటు 18 ఏళ్లు నిండిన యువత క్రీడా పోటీల్లో పాలుపంచుకోవాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలను వ్యాయామ ఉపాధ్యాయులు నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. వసతులను ఎంపీడీఓ, ఎంఈఓలు పర్యవేక్షించాలని కోరారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి, వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన



ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలను ఎంఈఓ రవీంద్ర బాబు మంగళవారం సందర్శించారు. బుధవారం మండలంలోని రేవులపల్లి, ఓబులోనిపల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన సందర్శించి, ఎస్‌ఏ–1 పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు.

సబ్సిడీపై టార్పాలిన్లు అందేనా?



మానవపాడులో టార్పాలిన్లు లేక వర్షానికి తడిసిన మిరప (ఫైల్)

- బహిరంగ మార్కెట్‌లో కొనడం రైతులకు తలకు మించిన భారం
- అకాల వర్షాలతో కల్లాల్లోనే ధాన్యం తడిసే ప్రమాదం

మానవపాడు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వ్యవసాయ పనిముట్లకు, టార్పాలిన్ కవర్లకు మంగళం పాడారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఇప్పుడైనా టార్పాలిన్లు పంపిణీ చేస్తారన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. పంట కోతల సమయం ప్రారంభమైనందున ధాన్యం ఆరబెట్టేందుకు, అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తివేయడంతో వాటిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు రైతులకు తలకు మించిన భారంగా మారింది. మిరప, వరి, మొక్కజొన్న తదితర పంటలను కల్లాల్లో ఉంచితే అకాల వర్షాలతో ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

ప్రభుత్వం నుంచి సబ్సిడీ టార్పాలిన్లు రాలేదు. కల్లాల్లో ధాన్యం కాపాడుకునేందుకు రైతులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు టార్పాలిన్లు కొనుగోలు చేస్తున్నారు. దీనిపై రైతులు పడుతున్న ఇబ్బందులను మరోసారి ప్రభుత్వానికి నివేదికలు పంపుతాం. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తే రైతులకు అందజేస్తాం.

– సక్రియానాయక్, ఏడీఏ, అలంపూర్

అందుబాటులో ఉంచుకోవాలి..



పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందికరంగా ఉన్నాయి. ప్రస్తుతం కొన్ని పంటలు చేతికి వచ్చాయి. మొక్కజొన్న, మిరప పంటలను ఆరబెట్టేందుకు టార్పాలిన్లు లేక అవస్థలు పడుతున్నాం. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం సబ్సిడీ ద్వారా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నాము.

– గోపాల్, రైతు, గోకులపాడు

రూ.5వేలు ఖర్చు..



నేను సాగు చేస్తున్న పంట పొలంలో పండించిన ధాన్యం మొక్కజొన్న, మిరప పంటలను కప్పి ఉంచేందుకు టార్పాలిన్లు కొనుగోలు చేయడం భారంగా మారింది. ఒక్కో టార్పాలిన్‌కు రూ. 5వేల దాకా ఖర్చు వస్తోంది. గతంలో టార్పాలిన్లు సబ్సిడీపై వచ్చేవి. ప్రభుత్వం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– శ్రీకాంత్‌రెడ్డి, రైతు, మానవపాడు

నిబంధనల మేరకు పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటయ్య

అయిజ: ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనల మేరకు పనిచేయాలని ఎంపీడీఓ వెంకటయ్య కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కొత్త నర్సరీ నిర్వహణ, ఎల్‌ఆర్‌ఎస్, సీఎం కప్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, అన్ని రకాల రిజిస్టర్లు అప్‌డేట్ చేయడంతో పాటు జాబ్ కార్డులను అప్‌డేట్ చేసి సోషల్ ఆడిట్‌కు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. 2024–25 సంవత్సరానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో చేయబోయే పనుల కోసం ప్లానింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాజు, ఇన్‌చార్జ్ ఎంపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌ఐ నరేందర్‌ను అభినందిస్తున్న ఎస్పీ

కొత్తకోట రూరల్: పోలీస్ అమరుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కొత్తకోటలోని ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని రక్తదానం చేశారు. తాము ఇచ్చే రక్తం ఇతర ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగపడుతుందని, పోలీస్ అమరులు దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానం చేయడంతో ఎంతో సంతోషంగా ఉందని వారు అభిప్రాయపడ్డారు. రక్తదానం చేసిన వారిలో కె.శేఖర్‌చారి, కొత్తకాపు అచ్చిరెడ్డి, పసుపుల విష్ణు, వెంకటేష్, నాగేష్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్: పోలీసుల అమరవీరుల దినోత్సవంను పురస్కరించుకుని ఆత్మకూర్‌కు చెందిన యువకులు, పోలీసులు రక్తదానం చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో రక్తదాన శిబిరంలో ఎస్‌ఐ నరేందర్‌తో పాటు పోలీసు సిబ్బంది, యువకులు 10 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ రావుల గిరిధర్ అభినందించారు.



అమరచింత యువకులతో ఎస్పీ

అమరచింత: అమరచింతకు చెందిన యువకులు పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవంలో భాగంగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన కమలాకర్‌గౌడ్ ఇప్పటి వరకు 24 పర్యాయాలు రక్తదానం చేయడం అభినందనీయమంటూ ఎస్పీ గిరిధర్ మెమోంటోతో సత్కరించారు. కార్యక్రమంలో అమరచింత ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన స్కూల్‌బస్సు అసోసియేషన్ సభ్యులు

ఇందువాసిలో బాలుడి అదృశ్యం



గట్టు: మండలంలోని ఇందువాసి గ్రామానికి చెందిన వీరేష్ కనిపించడం లేదని బుధవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం నుంచి వీరేష్ కనిపించకపోవడంతో బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ మల్లేష్ విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 70294ను సంప్రదించాలని కోరారు.

నిషేధిత డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు

కొత్తకోట రూరల్: నార్కోటిక్ డ్రగ్స్‌ను గుర్తించేందుకు ఎస్పీ రావుల గిరిధర్ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. బుధవారం సాయంత్రం ఎస్పీ ఆదేశానుసారం కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి నార్కోటిక్ డ్రగ్స్‌ను గుర్తించడానికి స్పెషల్‌గా ట్రైనింగ్ పొందిన జాగిలంతో కొత్తకోట బస్టాండ్, భద్రప్ప కాంప్లెక్స్, మదనాపురం రోడ్డు, మహేశ్వరి లాడ్జ్ తదితర ఏరియాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిషేధిత డ్రగ్స్‌ను ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు. డ్రగ్స్ వాడుతున్నట్టు, డ్రగ్స్ దొరుకుతున్నట్టు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. స్పెషల్ డ్రైవ్ టీం సిబ్బంది శ్రీనివాసులు, శివ, రాంబాబు తదితరులు ఉన్నారు.

జంతు సంరక్షణకు పాటుపడాలి

వనపర్తి టౌన్: జంతు సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, జంతువుల రక్షణకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్‌కు చెందిన హ్యూమన్ సొసైటీ డైరెక్టర్ ఎం.గుప్తా అన్నారు. ఈ మేరకు బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంరక్షణ వర్క్‌షాపును అడిషినల్ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం. గుప్తా, పశుసంవర్ధక శాఖ అధికారి కె.వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జంతువులపై ఇష్టానుసారంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. జంతువుల సంరక్షణతోనే ప్రకృతి సంపద పెరుగుతుందన్నారు.

కోళ్ల పందెం స్థావరాలపై పోలీసుల దాడులు

ధరూరు: మండలంలోని పాతపాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోళ్ల పందెం స్థావరాలపై పోలీసుల దాడులు నిర్వహించారు. కోళ్ల పందేలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి అక్కడ దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను, 10 కోళ్లను అదుపులోకి తీసుకున్నట్లు రేవులపల్లి పోలీసులు తెలిపారు. అలాగే మూడు ద్విచక్ర వాహనాలు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుకూర్ తెలిపారు.

నిరుపయోగంగా క్రీడా మైదానాలు

- వసతులు కల్పించడంలో విఫలం
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి



కానాయపల్లితండాలో నిరుపయోగంగా క్రీడా మైదానం

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసుకొచ్చి యువత క్రీడల్లో రాణించేలా గ్రామీణ క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. క్రీడా మైదానాలు పూర్తయ్యి రెండేళ్లు గడుస్తున్నా కొన్ని గ్రామాల్లో స్థల వివాదాలతో మొదటికే మోక్షం లేకుండా పోయింది. పనులు పూర్తయిన వాటిలో కూడా మొక్కుబడిగా ఏర్పాటు చేసి, కనీస వసతులను మరిచారు. ఒక్కో క్రీడా మైదానానికి దాదాపు రూ.2.50లక్షలు కేటాయించినప్పటికీ పలు చోట్ల మైదానం ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. మరికొన్ని క్రీడా మైదానాలు ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఇంకొన్ని చోట్ల బహిర్భూమికి వాడుతున్నారు. క్రీడా మైదానాల్లో ఒక్క రోజు కూడా ఏ ఒక్క క్రీడ నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రభుత్వ సంకల్పం ఆచరణలో విఫలమవుతుందడానికి గ్రామీణ క్రీడా మైదానాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి. క్రీడా మైదానాల పేరిట పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో అనువైన స్థలాలను ఎంపిక చేయకపోవడంతో అలంకారప్రాయంగా క్రీడా మైదానాలు మారాయి.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న జిల్లా సెక్టోరియల్ అధికారి శాంతిరాజు

శాంతినగర్: ఎస్‌ఏ–1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శాంతిరాజు ఉపాధ్యాయులకు సూచించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న పరీక్షల పనితీరును సెక్టోరియల్ అధికారి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులకు పరీక్షల నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పరీక్షల టైం టేబుల్‌ను బోర్డుపై రాయాలని, విద్యార్థుల నమోదు ఆన్‌లైన్‌లో, ఫిజికల్‌గా సమానంగా ఉండేలా చూడాలని ప్రధానోపాధ్యాయులు వెంకటనర్సమ్మ, జీవన్ కుమార్‌కు సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వండిపెట్టాలని వంట ఏజెన్సీ మహిళలను ఆదేశించారు. అంతేగాక కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ పర్సెంటేజీ పెంచాలని సీఆర్‌పీ నాగేష్‌కు సూచించారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కురువ పల్లయ్య

గద్వాల అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం చేసిందని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కురువ పల్లయ్య ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పది నెలల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థపై నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని, బడుగు, బలహీన వర్గాలను విద్యకు దూరం చేసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. గురుకుల పాఠశాలలను మూసివేసే కుట్రకు పూనుకుంటుందని, ప్రైవేటు కళాశాలలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో యాజమాన్యాలు రోడ్లపైకి వచ్చి నిరసన చేస్తున్నారని, వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ 33జిల్లాల్లో తీసుకొచ్చిన మెడికల్ కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధిస్తున్నారని, గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ అందించి పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహకరించాలని కోరారు. బీఆర్‌ఎస్వీ కమిటీలను ఏర్పాటు చేసి ప్రభుత్వం విద్యావ్యవస్థపై వహిస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఎండగడతామన్నారు. సమావేశంలో మాజ్, ముని, వీరేష్, ఖాజావలి, గోపాల్, ఫారజ్, బషీర్ తదితరులు ఉన్నారు.

రైతులపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గద్వాల అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం దసరాలోపు రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. జిల్లాలోని రుణమాఫీ కానీ రైతుల నుంచి ఈనెల 25వ తేదీన వివరాలను సేకరించి, కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బుచ్చిబాబు, గొని శ్రీనివాస్ యాదవ్, లవన్న, వెంకట్రాములు, విష్ణు తదితరులు ఉన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



ఉండవెల్లిలో నిరసన తెలుపుతున్న రైతులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న కోరారు. పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతూ రైతులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. కేంద్రాలు ప్రారంభించకపోవడంతో చేసేదేం లేక రైతులు దళారులను ఆశ్రయించి మోసపోతున్నారని వాపోయారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందించాలని, పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకుల్లో రైతులకు ఆర్థిక భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మద్దిలేటి, సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతులు మద్దిలేటి, పెద్ద లక్ష్మన్న, సోడ నబి, ఎర్రన్న, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

'చలో నాగర్‌కర్నూల్' పోస్టర్ విడుదల



శాంతినగర్‌లో పోస్టర్‌లు విడుదల చేస్తున్న మాలమహానాడు నాయకులు

శాంతినగర్: హలో మాల చలో నాగర్‌కర్నూల్ పోస్టర్లను మాలమహానాడు నాయకులు బుధవారం శాంతినగర్‌లోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో విడుదల చేశారు. ఈనెల 27న నిర్వహించే మహాసభలో మాలలంతా ఏకతాటిపై నిలిచి తమ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే విధంగా పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరుకావాలని నాయకులు కోరారు. ఈసందర్భంగా మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గం నుంచి మాలలు భారీ సంఖ్యలో నాగర్‌కర్నూల్ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. 2004లో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ బిల్లును కొట్టివేసిందని, 2024లో ఏ రాష్ట్రంలో వాళ్లు అమలు చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడం సరైందికాదన్నారు. వర్గీకరణ చట్టం అమలు పరచాలంటే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి అన్ని ఆమోదాలు పొందినప్పుడే వర్గీకరణ సాధ్యపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా తీర్పును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణకు అత్యుత్సాహం చూపిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ నరసింహులు, మునిస్వామి, నరసింహ, రామబ్రహ్మలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

గట్టు: సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు నరసింహ విజ్ఞప్తి చేశారు. బుధవారం గట్టులో జిల్లా మహసభలకు సంబంధించిన కరపత్రాలను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికులు, ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈనెల 25, 26వ తేదీల్లో జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహసభలకు ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, సాగర్, రమణ హాజరవుతున్నట్లు తెలిపారు. కావున పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో స్వామి, గోవిందు, జయన్న, శాంతప్ప, రెడ్డప్ప, లక్ష్మన్న, నర్సింహులు, భీమన్న పాల్గొన్నారు.

భైరాపురం రోడ్డు బురదమయం



భైరాపురంలో బురదమయంగా మారిన బీటీ రోడ్డు

ఉండవెల్లి: మండలంలోని భైరాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భైరాపురం కూడలి నుంచి గ్రామ చివరి వరకు రోడ్డు మొత్తం గుంతలుగా మారడంతో బురద చేరింది. రోడ్డు మరమ్మతు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు రోడ్డు వేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కొద్ది రోజులకే రోడ్లు పాడవుతున్నాయని ఆరోపిస్తున్నారు. రోడ్డు పరిస్థితిని ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించిన దాఖలాలే లేవని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. ఇప్పటికైనా రోడ్డును అధికారులు పరిశీలించి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.